నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
3 నిజామాబాద్ శనివారం 8 జూన్ 2024 ADILABAD NIRMAL

## మృగశిర కార్తె సందడి

నిర్మల్ అర్బన్/ఖానాపూర్/కుంటాల, జూన్ 7 : మృగశిర కార్తె (మిరుగును) శుక్రవారం నిర్మల్ జిల్లాలో ప్రజలు ఘనంగా నిర్వహించారు. పండుగ రోజు చేపలను తినడం ఆనవాయితీగా వస్తున్నది. నిర్మల్, ఖానాపూర్ చేపల మార్కెట్లు ప్రజలతో కిక్కిరిశాయి. చేపల రకాలను బట్టి కిలో రూ.150 నుంచి 500 వరకు విక్రయించారు. పలు గ్రామాల్లో చేపలు పట్టేందుకు వచ్చిన మత్స్యకారులతో చెరువులు, కుంటలు సందడిగా మారాయి.



నిర్మల్ పట్టణంలో చేపల మార్కెట్లో రద్దీ

## ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

**తాంసి ఎంపీపీ మంజులాశ్రీధర్‌రెడ్డి**



మాట్లాడుతున్న ఎంపీపీ మంజులాశ్రీధర్ రెడ్డి

తాంసి, జూన్ 7 : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అన్ని వసతులు అందుతాయని తాంసి ఎంపీపీ మంజులాశ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బడిబాట రెండో రోజు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కప్పర్ల ప్రాథమిక పాఠశాలలో నలుగురు విద్యార్థులను ఒకటో తరగతిలో చేర్పించారు. కప్పర్ల జడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో బండల నాగపూర్, నిపాని గ్రామాలకు చెందిన 20 మంది పిల్లలకు అడ్మిషన్ ఇచ్చారు. బడీడు పిల్లలను, బడి మానేసిన విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, రాజన్న, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



విత్తనాల దుకాణంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అధికారులు

## అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలి

**-నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**

నిర్మల్ అర్బన్, జూన్ 7 : రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని అధికారులు, డీలర్లను నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశించారు. శుక్రవారం నిర్మల్ పట్టణంలోని అరుణ్ ఆగ్రో ఏజెన్సీస్ సీడ్స్, ఫెస్టిసైడ్ దుకాణాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ విత్తన నిల్వలు, ధరల పట్టికను ప్రతి దుకాణంలో ప్రదర్శించాలని యజమానులకు సూచించారు. విత్తనాల అక్రమ రవాణాను నియంత్రించేందుకు వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో అన్ని మండలాల్లో తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. వానకాలం పంటల ప్రణాళికకు అనుగుణంగా సరిపడా పత్తి, మొక్కజొన్న, సోయా, కంది, ఇతర పప్పు దినుసుల విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లాలో విత్తనాలు, ఎరువుల కొరత లేదని, అవసరం మేరకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రోజు వారీగా రిపోర్టులను అందించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఎరువులు, విత్తనాలకు కొన్న వెంటనే రసీదు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఇక్కడ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, తదితరులున్నారు.

### అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలన్నారు. పనుల పురోగతి వివరాలను తెలుసుకున్నారు. అధికారులు పనులను పర్యవేక్షించాలని నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బడులు ప్రారంభమయ్యే నాటికి ప్రతి విద్యార్థికీ దుస్తులు అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రవీందర్ రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో గోవింద్ తదితరులున్నారు.

# రైతు భరోసా ఎప్పుడో?

● ఎకరాకు రూ.15 వేలు అందేనా ! ● జిల్లాలో 1,63,359 మంది రైతులు ● వానకాలం సాగు పెట్టుబడి కోసం ఎదురు చూపులు

ఆదిలాబాద్, జూన్ 7 ( నమస్తే తెలంగాణ) : కేసీఆర్ సర్కారు హయాంలో ప్రారంభించిన రైతు బంధు పథకం అన్నదాతల పాలిట వరంగా మారింది. పంటల సాగుకు విత్తనాలు, ఎరువుల కోసం పెట్టుబడి కోసం ఆర్థిక ఇబ్బందులు పడే రైతులకు రైతుబంధు డబ్బులు కష్ట కాలంలో ఆదుకున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం పంట పెట్టుబడుల కోసం ఎకరాకు రూ. 5 వేల చొప్పున వానకాలం, యాసంగి సీజన్లకు రూ.10 వేలను రైతులకు పంపిణీ చేసింది. ప్రతి సీజన్‌కు ముందుగానే రైతు బంధు డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యేవి. దీంతో రైతులు సీజన్‌కు ముందుగానే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి సకాలంలో విత్తనాలు వేసేవారు. పంటలకు అవసరమైన సమయంలో ఎరువులను వేయడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉండేవి. విత్తనాలు, ఎరువుల దుకాణాదారులు సైతం రైతుబంధు డబ్బులు వస్తాయనే నమ్మకంతో ఉద్దెర సైతం ఇచ్చేవారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన రైతుబంధు పథకం అన్నదాతలకు అండగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని కాపీ కొట్టి కిసాన్ సమ్మాన్ యోజనను ప్రారంభించింది. దేశంలోని పలు రాష్ట్రాలకు కేసీఆర్ సర్కారు తెచ్చిన రైతుబంధు పథకం ఆదర్శంగా నిలిచింది.

### ఎకరానికి రూ.15 వేలు ఎప్పుడో..?

గతేడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో రైతుభరోసా పథకాన్ని చేర్చింది. ఈ పథకంలో భాగంగా రైతులకు ఎకరాకు రూ.15 వేలను పంపిణీ చేస్తామని ప్రకటించింది.



భీంపూర్ మండలం పిప్పల్‌కోటిలో విత్తనాలు వేస్తున్న రైతులు

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ యాసంగిలో ఈ పథకాన్ని అమలు చేయక రైతుబంధుకు అందించే ఎకరాకు రూ.5 వేల చొప్పున మాత్రమే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. జిల్లాలో 1,63,359 మంది రైతులు ఉండగా ఎకరాకు రూ. 5 వేల చొప్పున పంట పెట్టుబడి సాయం అందించాలి. ఒక సీజన్‌కు గానూ రూ.276.19 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. రైతు భరోసా పథకం అమలు చేస్తే ఈ డబ్బులు బాగా పెరుగుతాయి. జిల్లాలో వానకాలం సీజన్ ప్రారంభమైంది. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులు పలు చోట్ల విత్తనాలు నాటుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రైతుభరోసా పథకం డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి తమకు సకాలంలో డబ్బులు అందితే పంటల సాగు ఖర్చుల కోసం ఉపయోగపడుతాయని, లేదంటే అప్పులు చేయాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి రైతుభరోసా డబ్బులు అందజేయాలని కోరుతున్నారు.

## పిడుగు పడి బాలుడి మృతి



జాదవ్ కృష్ణ(ఫైల్)

సారంగాపూర్, జూన్ 7 : నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం దుర్గానగర్ గ్రామానికి చెందిన బాలుడు జాదవ్‌కృష్ణ (14) శుక్రవారం పిడుగుపాటుతో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..తల్లి సరితాబాయితో కలిసి జాదవ్ కృష్ణ చేనుకు వెళ్లాడు. మధ్యాహ్నం వర్షం కురియడంతో వారు చెట్టు కిందికి వెళ్లారు. ఒక్కసారిగా ఆ చెట్టుపై పిడుగు పడడంతో జాదవ్ కృష్ణకు తీవ్రగాయాలు కాగా సరితాబాయికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని నిర్మల్ ప్రభుత్వ దవాఖానకు తీసుకువస్తుండగా జాదవ్ కృష్ణ మృతి చెందాడు. తండ్రి పండిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. జాదవ్ సరితాబాయిపండిత్ దంపతులకు జాదవ్ కృష్ణ, మీనాక్షి, సోమ సంతానం. ఒక్కగానొక్క కుమారుడి మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

### గాలివాన బీభత్సం

నార్నూర్, జూన్7 : ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలంలో శుక్రవారం ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. మండలంలోని గౌరి గ్రామంలో హనుమాన్ మందిరం ఆలయం రేకులతో పాటు ఏడు ఇండ్ల పైకప్పుల రేకులు ఎగిరిపోయాయి. పెద్ద వృక్షాలు నేలకూలాయి. విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇండ్లలోని నిత్యావసర సరుకులు తడిసి పోయాయి. నష్టపోయిన బాధితులకు ఆర్థిక సాయం అందించాలని ఆదివాసీ సంఘాల నాయకులు అధికారులను కోరారు. బాధితులను పరామర్శించిన వారిలో ఏఎస్‌యూ ప్రధాన కార్యదర్శి పెందోర్ సంతోష్, నైతం సోనేరావ్, మెస్రం గోవింద్, సోయం మాణిక్, సత్యపాల్, మడావి ధర్మ, తదితరులు ఉన్నారు.




శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

## 'మిషన్ భగీరథ'పై ఇంటింటా సర్వే చేయాలి

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

ఎదులాపురం,జూన్ 7 : ఆదిలాబాద్ జిల్లాలోని మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై ఇంటింటా సర్వే చేయాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మొబైల్ అప్లికేషన్‌పై శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా నుంచి మొబైల్ అప్లికేషన్‌పై హైదరాబాద్‌లో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లతో ప్రాజెక్టర్ ద్వారా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు టెక్నికల్ అసిస్టెంట్లు పంచాయతీ సెక్రటరీలు, ఈజీఎస్, ఐకేపీసీసీలను సర్వే అధికారులుగా నియమించినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 847 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు. జిల్లాలో ఇంటింటికీ వెళ్లి మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల సంఖ్య, నీరు వస్తుందా? లేదా ? అనే వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని తెలిపారు. ప్రతి ఇంటిలోని కుటుంబ సభ్యుల వివరాలు మొబైల్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. 10 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ శిక్షణలో డీపీవో శ్రీలత, ఎస్సీఎండీ సురేశ్, ఈఈ చంద్రమోహన్, డీఎల్పీవో ఫణింద్ర, జీవన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ
విలేకరులు కావలెను
అర్హతలు :
- పాత్రికేయులుగా పనిచేయాలన్న ఉత్సాహం.
- మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన.
- తెలుగు భాషపై పట్టు ఉండి.. చక్కగా రాయగలగాలి.
- ఇంటర్ ఉత్తీర్ణత సాధించి.. 30 ఏళ్లలోపు ఉండాలి.
- రిపోర్టింగ్‌పై ఆసక్తి ఉన్నవారురాత పరీక్ష, ఆ తర్వాత ఇంటర్వ్యూలకు హాజరుకావాలి.
- బయోడాటాతో రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు తెచ్చుకోగలరు.
- తెలుగు టైపింగ్ వచ్చిన వారికి ప్రాధాన్యం.

నిర్మల్‌కు కావలసిన కేంద్రాలు
1. నిర్మల్ టౌన్ 2. నిర్మల్ శివాజీచౌక్ 3. మామడ

ఆదిలాబాద్‌కు కావలసిన కేంద్రాలు
1. ఆదిలాబాద్ టౌన్ 2. ఆదిలాబాద్ రూరల్ 3. మావల
4. ఉట్నూర్‌టౌన్ 5. తలమడుగు 6. జైనథ్ రూరల్

రాతపరీక్ష తేదీ : 11-06-2024 (మంగళ వారం)
సమయం : ఉదయం 11 గంటలకు..
నిర్మల్ పరీక్షా స్థలం : వశిష్ట డిగ్రీ కళాశాల, భాగ్యనగర్ కాలనీ, భైంసా రోడ్, నిర్మల్
ఆదిలాబాద్ పరీక్షా స్థలం : టీఎన్‌జీవో భవన్, ఆదిలాబాద్
ఫోన్ నంబర్లు : 94403 83136, 9182777993, 9182777029

# రేపే గ్రూప్-1 ప్రిలిమ్స్

- పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- నిర్మల్ జిల్లాలో 13 పరీక్షా కేంద్రాలు.. 4608 అభ్యర్థులు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- రెండు గంటల ముందుగానే చేరుకోవాలి
- 144 సెక్షన్ అమలు

నిర్మల్ అర్బన్, జూన్ 7 : నిర్మల్ జిల్లాలో ఆదివారం నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఇప్పటికే ఆయా శాఖల అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, వైద్య ఆరోగ్య, పోలీస్ ఇతర శాఖల అధికారులతో సమీక్షలను నిర్వహించి పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలని ఆదేశించారు. నిర్మల్ జిల్లా నుంచి గ్రూప్ వన్ పరీక్షకు 4608 అభ్యర్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ ఇప్పటికే టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లను అందుబాటులో ఉంచింది. అభ్యర్థుల మొబైల్ నంబర్లకు పంపిన ఎస్ఎంఎస్ లింక్‌ల ద్వారా కూడా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించింది.

### జిల్లా వ్యాప్తంగా అభ్యర్థులు

నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 13 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాట్లు చేశారు. వీటిని నిర్మల్ జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేశారు. మొత్తం 4608 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు. కేంద్రాల్లో అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి పరీక్ష కేంద్రంలో తాగునీరు, బెంచీలు, ఫ్యాన్‌లు, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా ఎస్పీ జానకీ షర్మిల చర్యలు తీసుకుంటున్నారు.

### పరీక్షకు అధికారులు వీరే..

ఆదివారం నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు టీజీపీఎస్సీ అధికారులను నియమించింది. జిల్లాలో 13 పరీక్ష కేంద్రాల్లో 13 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 14 మంది అబ్జర్వర్లు ఇద్దరు రూట్ అధికారులు, ఇన్విజిలేటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విధుల్లో పాల్గొననున్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

### రెండు గంటల ముందే చేరుకోవాలి..

పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులురెండు గంటల ముందుగానే చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఒక రోజు ముందుగానే తమకు కేటాయించిన సెంటర్‌ను చూసుకున్నట్లయితే ఎలాంటి ఇబ్బందులుండవని తెలిపారు. ఉదయం 9 గంటలకు అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించిన అనంతరం బయోమెట్రిక్ (వేలి ముద్రలు) తీసుకొని పరీక్ష గదిలోకి పంపనున్నారు. ఉదయం 10 గంటలకు గేట్లు మూసివేయనున్నారు. తర్వాత నిమిషం లేటు వచ్చినా అనుమతించరు. ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షను నిర్వహించనున్నారు. బయోమెట్రిక్ విధానం ద్వారా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తుండడంతో చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని చేతులకు గోరింటాకు, మెహంది వంటివి లేకుండా చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు, స్మార్ట్ వాచ్‌లు, క్యాలిక్యులేటర్లు, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్‌ఫోన్లకు అనుమతి లేదని, బూట్లు వేసుకొని రావద్దని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు ఓటర్, ఆధార్, పాన్, ఎంప్లాయ్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ వంటి గుర్తింపు కార్డులతో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. హాల్‌టికెట్‌పై అభ్యర్థి రీసెంట్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను అతికించాలని, చినిగిపోయిన, పాత ఫొటోలను అతికించవద్దని తెలిపారు.

### పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

నిర్మల్ జిల్లాలో ఈ నెల 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరి పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గ్రూప్ -1 ప్రిలిమినరి పరీక్ష నిర్వహణ, నిబంధనల పై అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిర్మల్ పట్టణంలో 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రూట్ అధికారులకు, సిబ్బంది ఉదయం 7 గంటలకే చేరుకోవాలని ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలన్నారు. ప్రతి అభ్యర్థినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి బయోమెట్రిక్ తీసుకోవాలని సూచించారు. అనుమతి లేని వస్తువులను తీసుకురానీయకుండా చూడాలని సూచించారు. అభ్యర్థులు నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాలను సం బంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. అంతకుముం దు అదనపు కలెక్టర్, గ్రూప్-1 పరీక్ష నోడల్ అధికారి ఫైజా న్ అహ్మద్ పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, ఏర్పాట్లు, విధులు, తదితర అంశాలపై అధికారులు, సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల ప్రాంతీయ సమన్వయ కర్త గంగారెడ్డి, అధికారులు తదితరులున్నారు.



నిర్మల్ పట్టణంలో గ్రూప్-1 పరీక్ష కేంద్రం

### నిబంధనలు అమలు చేయాలి


**-ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

ఎదులాపురం, జూన్ 7 : గ్రూప్-1 పరీక్ష నిర్వహణ నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు, బయోమెట్రిక్ ఆఫీసర్లకు గ్రూప్-1 పరీక్ష నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం జిల్లాలోని 18 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-1 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6729 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు పర్యవేక్షించాలన్నారు. పురుషులు, మహిళల అభ్యర్థులకు విడిగా తనిఖీ చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అభ్యర్థుల ఐడీ కార్డులతో హాల్ టికెట్లును పరిశీలించాలని, పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని, చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే ఎమర్జెన్సీ పర్సస్ అనుమతి ఉందని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని, పరీక్ష కేంద్రాలు, హాల్‌టికెట్ డౌన్‌లోడ్ సందేహాలపై జిల్లా స్థాయి హెల్ప్‌లైన్ నంబర్ 9491053677లో సంప్రదించాలన్నారు. హాల్ టికెట్‌ను http://www.tspsc.gov.in వైబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అనుమతి ఉంటుందని, ఆ తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధికారులు ఉన్నారు.


### గ్రూప్-1 పరీక్షకు పటిష్ట బందోబస్తు

**-ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌష్ ఆలం**

ఎదులాపురం, జూన్ 7: టీజీపీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 18 పరీక్ష కేంద్రాల్లో 6729 మంది పరీక్ష రాయనున్నారని తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం ప్రధాన రోడ్లు, చౌరస్తాలలో సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరిసర ప్రాంతంలో సభలు, ఊరేగింపులు ర్యాలీలు తీయవద్దన్నారు. సమీపంలో జిరాక్స్ షాపులు తెరిచి ఉంచరాదని షాపుల యజమానులకు సూచించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా అటెండెన్స్ తీసుకుంటారని, ఉదయం 10 గంటలకు పరీక్ష కేంద్రం గేట్ మూసివేస్తారని, నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు కలర్ ఫొటో, ఒరిజినల్ ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఉద్యోగి గుర్తింపు కార్డు, ఓటర్ గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి తప్పనిసరిగా తేవాలని సూచించారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా




సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

# రైతుల కోసం ఎంతకైనా తెగిస్తా

● పోడు భూములకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలివ్వాలి ● కాంగ్రెస్ సర్కారు పేద రైతుల పొట్ట కొడుతున్నది

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ, జూన్ 7 : పేద రైతులకు అన్యాయం జరిగితే ఎంతకైనా తెగిస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని కేశవ్ పట్నం శివారులో పోడు భూముల విషయమై రైతులు, అటవీ శాఖాధికారుల మధ్య వాగ్వాదం తలెత్తడంతో విషయం తెలుసుకొని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బైక్‌పై అక్కడికి వెళ్లారు. అధికారులతో మాట్లాడారు. పోడు భూముల్లో గిరిజన రైతులు సాగు చేయడాన్ని అడ్డుకోవద్దని తెలిపారు. ఎండ్ల తరబడి గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలిచ్చింది బీఆర్ఎస్ సర్కారేనని తెలిపారు. కొన్ని కారణాలతో కొందరికి పట్టాలు అందలేదనే విషయాన్ని పసిగట్టిన కాంగ్రెస్ నాయకులు, అధికారులు అమాయక రైతులపై అధికారం చెలాయించడం సరికాదని హెచ్చరించారు. కేశవ్‌పట్నం శివారులోని భూములను సాగు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకొని పేద రైతుల పొట్ట కొడుతున్నదని ఆరోపించారు. పేదలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ఇక్కడి ఎమ్మెల్యేగా గిరిజన రైతుల పక్షాన పోరాడుతానని తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకు పొలంలోనే బస చేస్తానని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకపై ఇలాంటి నీచపు పనులు మానేసి పేద రైతులకు పట్టాలు అందజేసి, ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులకు గురి చేసినా, వారి జీవితాలతో చెలగాటమాడినా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఆ యన వెంట బీఆర్ఎస్ నాయకులు, రైతులు, గ్రామస్తులున్నారు.



అటవీ శాఖాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, గిరిజన రైతులు